శిక్షణ ఇస్తూ.. ప్రేరణ నింపుతూ..

ఆమె ప్రభుత్వ పాఠశాలలో క్రాఫ్ట్ ఉపాధ్యాయిని. తన వృత్తితో పాటు విద్యార్థుల్లో వినూత్న ఆలోచనలు నింపుతూ పుష్పగుచ్ఛాలు, ఫ్లవర్‌వాజ్‌లను ఎలా తయారు చేయాలో శిక్షణ ఇస్తోంది. దీని ద్వారా ఆదాయ మార్గాలు ఎలా సమకూర్చుకోవాలో నేర్పుతూ విద్యార్థుల్లో ప్రేరణ నింపుతోంది.

• విద్యార్థులకు ఉపాధి మార్గాలు చూపుతున్న టీచర్



తాను తయారు చేసిన ఫ్లవర్ వాజ్‌లతో క్రాఫ్ట్ టీచర్ కుమారి



విద్యార్థులకు ఫ్లవర్ వాజ్‌ల తయారీని నేర్పుతున్న ఉపాధ్యాయిని

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని దామరమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కుమారి క్రాఫ్ట్ ఉపాధ్యాయినిగా విధులు నిర్వహిస్తోంది. రోజువారి విధుల్లో భాగంగా విద్యార్థినులకు కుట్లు, అల్లికలు, పట్టలు అల్లడం వంటివి నేర్పుతూనే పలు అంశాలపై అవగాహన కల్పిస్తోంది. తన సొంత ఖర్చులతో ఫ్లవర్‌వాజ్‌లు, పుష్పగుచ్ఛాలు ఎలా తయారు చేయాలో నేర్పుతూ ఆదాయ మార్గాలను సమకూర్చుతోంది. పురుషులు మాత్రమే చేయగలిగే ఫ్లవర్ వాజ్‌లు, పుష్పగుచ్ఛాలు, వాల్ హ్యాంగ్స్‌ను ఆమె తయారు చేయడంతో పాటు వాటిపై విద్యార్థులకు శిక్షణ ఇస్తోంది.

రాష్ట్రస్థాయికి సైన్స్ ప్రదర్శన

ఇటీవల ప్రపంచ ప్రఖ్యాత వింతల్లో ఒకటైన తాజ్ మహల్‌ను థర్మాకోల్ షీట్‌లో విద్యార్థులకు ఎలా తయారు చేయాలో నేర్పింది. దీనిని విద్యార్థులు తయారు చేసి సైన్స్ ప్రదర్శనలో ఉంచగా, ఇది జిల్లాలో మొదటి స్థానంలో నిలిచి, రాష్ట్రస్థాయికి ఎంపికైంది. నేటి విద్యారంగంలో క్రాఫ్ట్ తరగతులు నిర్వీర్యమవుతున్న వేళ విద్యార్థులు కేవలం విద్యకు మాత్రమే పరిమితం కాకుండా, ఉపాధి అవకాశాలను ఇప్పటి నుంచే మెరుగు పరుచుకునే విధంగా ఆమె విద్యార్థులను తీర్చిదిద్దుతోంది.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన తాజ్‌మహల్ బొమ్మ

ప్రతిభను వెలికి తీస్తున్నా



క్రాఫ్ట్‌తో పాటు విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్నా. అలాగే విద్యార్థుల్లో దాగున్న ప్రతిభను వెలికి తీసేందుకు కృషి చేస్తున్నా. కేవలం విద్యకు మాత్రమే పరిమితం కాకుండా ఉపాధి అవకాశాలను తెలుసుకునే విధంగా వారిని తీర్చిదిద్దుతున్నా.

– కుమారి, క్రాఫ్ట్ టీచర్

మెలకువలు నేర్చుకుంటున్నా



క్రాఫ్ట్ టీచర్ తమకు ఫ్లవర్‌వాజ్‌లు, పుష్పగుచ్ఛాలు ఎలా తయారు చేయాలో నేర్పుతున్నారు. అలాగే కలర్ పేపర్లతో వాల్ హ్యాంగ్స్ ఎలా తయారు చేయాలో మెలకువలు నేర్చుకుంటున్నాం. దీని వల్ల భవిష్యత్‌లో మంచి అవకాశాలు ఉంటాయని భావిస్తున్నాం.

– వైష్ణవి, ఆరో తరగతి విద్యార్థిని

క్లుప్తంగా

ఆంజనేయస్వామికి విశేష పూజలు



విశేషాలంకరణలో ఆంజనేయస్వామి

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న శ్రీవీర అభయాంజనేయస్వామికి అర్చకులు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, ప్రత్యేక పూజలు, తిరిగి సాయంత్రం స్వామికి పూజలు, పల్లకి సేవ గావించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

దిమ్మెను ఢీకొన్న లారీ



ప్రమాదంలో పాక్షికంగా దెబ్బతిన్న దిమ్మె

పొదలకూరు : మండలంలోని నందివాయి, ప్రభగిరిపట్నం గ్రామాల మైనింగ్స్ నుంచి తెల్లరాయి తోలుతున్న లారీ మంగళవారం పట్టణంలోని రామనగర్‌గేటు సెంటరులో ఉన్న దివంగత మాజీ ఎమ్మెల్యే నువ్వుల వెంకటరత్నంనాయుడు విగ్రహం దిమ్మెను ఢీకొంది. తెల్లవారుజాము కావడం వల్ల ఎలాంటి ప్రాణహాని కలుగలేదు. లారీ డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో ప్రమాదం సంభవించినట్లుగా భావిస్తున్నారు. విగ్రహం కింద ఉన్న దిమ్మె ధ్వంసమైంది. విచ్చలవిడిగా తెల్లరాయిని తరలిస్తుండడం వల్లనే ఈ ప్రమాదం సంభవించినట్లుగా పోలీసులు భావిస్తున్నారు.

అన్నప్రసాదాలకు రూ.లక్ష విరాళం



ఆలయ సిబ్బందికి నగదును అందజేస్తున్న దాతలు

ఇందుకూరుపేట : ప్రముఖ పుణ్యక్షేత్రం గంగపట్నంలోని చాముండేశ్వరీదేవి అమ్మవారి ఆలయంలో అన్నప్రసాదానికి రూ.లక్ష విరాళాన్ని మంగళవారం అందజేశారు. నెల్లూరు నగరంలోని పడారుపల్లికి చెందిన గునుపూడి సాంబయ్య, ధనలక్ష్మి దంపతుల కుమారుడు, కోడలు వెంకట మల్లికార్జున, చందనప్రియ కలిసి నగదును ఆలయ సిబ్బందికి అందజేశారు.

కామాక్షితాయి సేవలో మెట్టుకూరు



ఆలయ సన్నిధిలో చిరంజీవిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారిని ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. ముందుగా గణపతి స్వామి, సుబ్రహ్మణ్యం స్వామి, మల్లికార్జున స్వామి, కామాక్షి తాయిలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చిరంజీవిరెడ్డిని అర్చకులు శేషవస్త్రాలతో సత్కరించారు. ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు పాల్గొన్నారు.

ముగిసిన చెస్ పోటీలు

కోవూరు : పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాల ఆవరణలో అండర్–17 ఓపెన్, బాలికల చెస్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఎస్పీఎస్ఆర్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో అండర్–17 ఓపెన్ విభాగంలో హేమలవర్షన్, సుమద్, అండర్–17 బాలికల విభాగంలో తేజస్విని, లక్ష్మి నిలిచారు. వీరు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ కార్యదర్శి పి.మస్తాన్‌బాబు తెలిపారు. పోటీలకు ఆర్బిటర్లుగా వంశీకృష్ణ, స్వాతి, కిశోర్, ప్రదీప్ వ్యవహరించారు.

ఎన్నడూ లేనివిధంగా సంక్షేమం అమలు



బ్రహ్మదేవిలో వృద్ధురాలితో మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

• మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి

ముత్తుకూరు : రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ ఎరుగని విధంగా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని, దీని వల్ల ప్రజల మధ్య ధైర్యంగా తిరుగుతున్నట్లు రాష్ట్ర వ్యవసాయ–సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని బ్రహ్మదేవి పంచాయతీలో రెండో రోజు మంగళవారం సాయంత్రం జరిగిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం దేశంలోనే సాహసోపేతమైన కార్యక్రమమని, నాలుగేళ్ల పదవీ కాలంలో అమలు చేసిన సంక్షేమ–అభివృద్ధి పథకాలను ప్రజల వద్దకు వెళ్లి ధైర్యంగా వివరిస్తున్నట్లు చెప్పారు. ప్రతి కుటుంబానికి ఐదారు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. విశాఖపట్నంలో జరిగిన 'గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్'లో దేశ విదేశాల నుంచి వచ్చిన ప్రముఖ పారిశ్రామికవేత్తలు సైతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రశంసించడమే దీనికి నిదర్శనమన్నారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు ఎప్పుడైనా ఇటువంటి సంక్షేమ పథకాలు అమలు చేశారా, ప్రజలకు అందజేశారా అని కాకాణి ప్రశ్నించారు. విశాఖ సమ్మిట్ విజయవంతం కావడంతో చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్‌నాయుడు బోరున విలపిస్తున్నారని ఎద్దేవా చేశారు.

2024లో వైఎస్సార్‌సీపీదే విజయం

2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధిస్తుందని, నెల్లూరు జిల్లాలో అన్ని స్థానాలను కైవసం చేసుకుంటుందని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని మంత్రి కాకాణి ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు చూపిస్తున్న ఆదరాభిమానాలే దీనికి ప్రత్యక్ష తార్కాణమన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, జెడ్పీటీసీ సభ్యుడు బందెల వెంకటసుబ్బయ్య, మండల ఉపాధ్యక్షుడు పోలిరెడ్డి చిన్నపరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నెల్లూరు శివప్రసాద్, నాయకులు మునుకూరు రవికుమార్‌రెడ్డి, ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, కట్టా సుబ్రహ్మణ్యం, షేక్ మస్తాన్, షేక్ జమీల్, దామవరపు శ్రీధర్‌రెడ్డి, సీపారెడ్డి రామమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి విజయం ఖాయం

• వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

వెంకటాచలం : తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి భారీ మెజారిటీతో విజయం సాధించడం ఖాయమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య పేర్కొన్నారు. వెంకటాచలంలోని వడ్డిపాళెం, గణేష్ గార్డెన్‌లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఓటర్లను కలిసి పేర్నాటిని గెలిపించాలని కోరారు. రాష్ట్ర చరిత్రలో ఎవరికీ సాధ్యం కాని విధంగా అన్నివర్గాల ప్రజలు, ఉద్యోగుల శ్రేయస్సు కోసం పనిచేసిన సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తింపు పొందారని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ మద్దతుతో నిలిచిన అభ్యర్థులను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు నరేష్‌నాయుడు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ వేమిరెడ్డికి సన్మానం



బుచ్చిరెడ్డిపాళెం : రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి–ప్రశాంతిరెడ్డి దంపతులను జొన్నవాడ ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డితో కలిసి మంగళవారం సన్మానించారు. నెల్లూరులోని ఆయన నివాసంలో కలిసిన వీరు జొన్నవాడ దేవస్థానంలో మే నెలలో జరిగే మహాకుంభాభిషేకం కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో డీఎల్‌డీఏ రాష్ట్ర అధ్యక్షుడు గొల్లపల్లి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పాండురంగస్వామికి ప్రత్యేక పూజలు

పొదలకూరు : మండలంలోని తాటిపర్తి గ్రామంలో ఉన్న రుక్మిణి సమేత పాండురంగ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పంచామృత అభిషేకం, హోమం, మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, మధ్యాహ్నం విశేష పూజలు, రాత్రి గ్రామోత్సవం, పండరి భజన, తెల్లవారుజామున అగ్నిగుండ ప్రవేశం జరుగుతుంది. ఈ ప్రత్యేక పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మైనార్టీ కమిషన్ సలహాదారుల సభ్యుడిగా షఫీఉల్లా

ముత్తుకూరు : ముత్తుకూరుకు చెందిన బీజేపీ మైనార్టీ మోర్చా నాయకుడు అబ్దుల్ షఫీఉల్లా జాతీయ మైనార్టీ కమిషన్ సలహాదారుల సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శి షరిక్ సయిద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా షఫీఉల్లా మాట్లాడుతూ, తనను ఆంధ్రప్రదేశ్ తరఫున జాతీయ కమిషన్ సలహాదారుడిగా నియమించినందుకు పీఎం నరేంద్ర మోదీ, మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి స్మృతి ఇరానీలకు కృతజ్ఞతలు చెప్పారు.

ఉచితంగా గాలికుంటు టీకాలు



రికార్డులు పరిశీలిస్తున్న జేడీ మహేశ్వరుడు

మనుబోలు : ఈనెల చివరి వరకు పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి టీకాలు వేస్తారని పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ మహేశ్వరుడు తెలిపారు. మనుబోలు పశు వైద్యశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం పాడి రైతులకు అవసరమైన అన్ని సదుపాయాలను సమకూరుస్తోందన్నారు. అత్యవసర సమయాల్లో గాయపడిన, రోగాల బారిన పడిన పశువుల కోసం 1962 వాహనాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని పొదలకూరు, వెంకటాచలంలో ఈ వాహనాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఆయన వెంట ఏడీ గురవారెడ్డి, పశు వైద్య సిబ్బంది ఉన్నారు.

స్త్రీ శక్తికి కళారూపం



పొదలకూరు : రావి ఆకుపై స్త్రీ శక్తి రూపం



ముత్తుకూరు : గుడ్డుపై చిత్రీకరించిన మహిళ విశ్వరూపం

పొదలకూరు : రావి ఆకుపై మహిళా శక్తి బొమ్మను రూపొందించారు మండలంలోని మహ్మదాపురం గ్రామానికి చెందిన రిటైర్డ్ డ్రాయింగ్ టీచర్ పచ్చా పెంచలయ్య. బుధవారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆకుపై స్త్రీ శక్తి స్వరూపాన్ని పెంచలయ్య రూపొందించారు.

గుడ్డుపై..

ముత్తుకూరు : మండలంలోని బ్రహ్మదేవి హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి విద్యార్థిని డి.హిమశర్వాణి మంగళవారం కోడిగుడ్డుపై మహిళ విశ్వరూపాన్ని చిత్రీకరించింది. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఇంటా బయట అనేక రూపాల్లో అనేక పాత్రలు సమర్థవంతంగా పోషిస్తూ, సమాజ పురోభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్న మహిళా లోకానికి ఈ చిత్రాన్ని అంకితం చేసింది.

మిత్ర పురుగులతో దిగుబడి పెంపు

• డీఆర్‌సీ ఏడీఏ మారుతీదేవి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ మారుతీదేవి

కొడవలూరు : వరిలో మిత్ర పురుగులను కాపాడుకోవడం ద్వారా దిగుబడి గణనీయంగా పెంచుకోవచ్చని జిల్లా వనరుల కేంద్రం(డీఆర్‌సీ) ఏడీఏ మారుతీదేవి సూచించారు. మండలంలోని నార్తురాజుపాళెంలో నిర్వహించిన డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించేలా చేయడమే పొలంబడి లక్ష్యమన్నారు. అధిక పురుగు మందులు, రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని చెప్పారు. ప్రత్యామ్నాయ మార్గాలైన జీవ సంబంధ ఎరువులు వాడాలన్నారు. తద్వారా మిత్ర పురుగులను కాపాడుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కోవూరు ఏడీఏ డి.సుజాత, డీఆర్‌సీ ఏఓలు శిరీష, శైలజ, మధురిమ, కొడవలూరు ఏఓ లక్ష్మి, వీఏఏ శివజ్ఞాన, రైతులు పాల్గొన్నారు.

స్వామి విహారం.. భక్తుల తన్మయం



రథాన్ని లాగుతున్న భక్తులు

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని పంచేడులో కొలువైన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయ ఉత్సవాల్లో భాగంగా మంగవారం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో స్వామివారు విహరిస్తుండగా భక్తులు తన్మయంతో దర్శించి మొక్కులు చెల్లించారు. తొలుత రథాన్ని పూలతో అందంగా ముస్తాబు చేశారు. అనంతరం స్వామి అమ్మవార్లక ప్రత్యేక పూజలు నిర్వహించి రథంలో కొలువుంచారు. ఈ సందర్భంగా రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. రథం ముందు భక్తులు టెంకాయలు, గుమ్మడికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా బొమ్మిరెడ్డి రమణారెడ్డి, బొమ్మిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, పరంధామరెడ్డి, బొమ్మ శరత్‌కుమార్‌రెడ్డి వ్యవహరించగా, ధర్మకర్త పెనబాక ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై వీర ప్రతాప్ ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు.

నేత్రపర్వం.. లక్ష్మీనరసింహుని రథోత్సవం



ప్రత్యేకాలంకరణలో స్వామి, అమ్మవార్లు



గ్రామవీధుల్లో బయలుదేరిన రథోత్సవం

ఇందుకూరుపేట : మండల కేంద్రంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని రథోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక పుష్పాలతో శోభాయమానంగా అలంకరించిన రథంపై స్వామి, అమ్మవార్లను కొలువుదీర్చారు. స్వామివారి రథాన్ని లాగేందుకు భక్తులు ఉత్సాహంగా పోటీపడ్డారు. మేళతాళాల నడుమ గ్రామంలో ఊరేగుతూ విహరిస్తున్న స్వామి, అమ్మవార్లకు గ్రామస్తులు వాకిళ్లలో ముగ్గులు వేసి స్వాగతం పలికారు. పండ్లు, కొబ్బరికాయ, కర్పూర హారతులు పట్టి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తన్మయం చెందారు. పానకాలు, ప్రసాదాలు అందజేసి భక్తిని చాటుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఉదయగిరి వెంకట శేషాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన రథోత్సవానికి ఉభయదాతలుగా స్థానికులు తాళ్లూరు రఘురామయ్య నాయుడు వ్యవహరించారు. రాత్రి పారువేట, అశ్వవాహన సేవ వేడుకగా జరిగింది. ఉభయకర్తలుగా జొన్నలగడ్డ వెంకట హరిప్రసాద్ జ్ఞాపకార్థం కుమారుడు గిరీష్‌కుమార్ వ్యవహరించారు. కార్యక్రమంలో అర్చకులు రంగాచార్యులు, నందకిశోర్, స్థానికులు పాల్గొన్నారు.

వేపనూనె వాడకంతో తెల్లకంకి నివారణ



వరి పంటను పరిశీలిస్తున్న ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్

కొడవలూరు : వేపనూనె వాడడం ద్వారా వరిలో తెల్లకంకి పురుగును నివారించుకోవచ్చని ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ ఎంసీ ఓబయ్య తెలిపారు. మండలంలోని గుండాలమ్మపాళెంలో బీపీటీ 3082 వరి సాగును పురుగుల నివారణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ వి.సురేఖాదేవితో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అగ్గి తెగులను సుడోమోనాస్ మందు వినియోగించడం ద్వారా నివారించుకోవాలని చెప్పారు. అనంతరం కేఎన్ఎం 733 వరిరకాన్ని పరిశీలించి సాగు పద్ధతుల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. రైతులు వెంకటేశ్వర్లు, సుధీర్ ఉన్నారు.

పది విద్యార్థులకు అల్పాహారం



మనుబోలు : అల్పాహారం అందజేస్తున్న ఏడీ గురవారెడ్డి



బుచ్చిరెడ్డిపాళెం : దామరమడుగులో..

మనుబోలు : మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సూచనలతో పశు వైద్యశాల ఏడీ గురవారెడ్డి చేతులమీదుగా మంగళవారం అల్పాహారం అందజేశారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పది విద్యార్థులు ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. హెచ్‌ఎం డేవిడ్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి మంత్రి కాకాణి ఎంతో ప్రోత్సాహం అందించారన్నారు. 10వ తరగతి ఫలితాల్లో మండలంలో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.20 వేలు, పాఠశాలలో మొదటి స్థానం సాధించిన వారికి రూ.10 వేలు నగదు బహుమతి అందజేయనున్నట్లు కో–ఆప్షన్ మెంబర్ అనమాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీకాంతరావు, రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత గుంజి రమేష్, వలంటీర్ గిరి తదితరులు పాల్గొన్నారు.

దామరమడుగులో..

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని దామరమడుగులో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం అల్పాహారాన్ని అందించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన విశ్రాంత ఎంఈఓ రమేష్‌బాబు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు ఉదయం స్టడీ స్కిల్స్‌పై ప్రత్యేక తరగతులు నిర్వహించడం, ఆ సమయంలో అల్పాహారాన్ని అందించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.సుధాకర్, ఉపాధ్యాయులు సురేష్, నరసయ్య, కృపాల్, కృష్ణమోహన్, చెన్నయ్య పాల్గొన్నారు.